# నిగర్వి...మహా మనీషి
# హక్కుల ఉద్యమానికి మారు పేరు

**అయ్యో ఈయనా..** చనిపోయింది! ఎప్పుడూ మా మధ్యే తిరుగుతుండేవాడే! ఇంత గొప్పవాడై ఉండీ... ఎంతో సాధారణంగా...మార్కెట్ వద్ద... కనిపించేవాడే! మామూలు మనిషిగా ప్రవర్తించేవాడే! ఆ సారును... స్కూటర్‌పై వెళుతుండగా చూసేవాడిని! ఇంతటి మహామనీషి అనితెలియలేదే! మామూలు మనిషిగా దుకాణానికి వచ్చి పోతుండేవారే! అంతిమ యాత్రలో ఆయన ఫోటోలను, ఆయన భౌతిక కాయాన్ని చూసి అనేక మంది నోట వెలువడిన మాట! అయ్యో... ఆయన గొప్పతనాన్ని గుర్తించలేక పోయామే... అనే ఆవేదన. ఆకాశమంత ఎదిగినా... ఒదిగి ఉన్న ఆయనలోని అసమాన వ్యక్తిత్వానికి ఇచ్చిన నివాళి! నివాసం ఉన్న ప్రియా కాలనీ...ఆయన నిత్యం తిరిగిన గుడిమల్కాపూర్, మెహదీపట్నం, కార్వాన్ వీధుల్లో ఆయన అంతిమ యాత్రసాగుతుండగా.. ఏ మాత్రం పరిచయం లేనిజనం కంటిలో కనీకనిపించకుండా కదలాడిన ఓ కన్నీటిబొట్టు! ఆయనతో పరిచయం లేని వారు సైతం... ఆయన మహోన్నత వ్యక్తిత్వం గురించి తెలియడంతో తండోపతండాలుగా అర్పించిన జోహార్లు! ఇక ఆయన గురించి తెలిసినవారు... ఆయన అభిమానులు... ఉద్యమ బంధువులు వేనకు వేలు!! అందరిలో కొందరిగా కాక... కొందరిలో ఒకరిగా తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూనే...అందరిలో ఒకడిగా కలిసిపోయి మెలగడం ఆయన ప్రత్యేకత! నిరాడంబరతకు నిలువుటద్దం... నిర్భాగ్యుల

పాలిట ఆపన్నహస్తం! కఠిన పదఘట్టనల కింద నలిగిపోతున్న బడుగు జీవుల కన్నీరు తుడిచేందుకు బాహువులు బావుటాలు చేసి రణన్నినాదం చేసిన స్వరం! ఎక్కడో అడవిలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఓ అభాగ్య మృతదేహానికి న్యాయం కోసం విచ్చుకున్న గొంతు! దానికి మరో పేరే బాలగోపాల్! రాజ్య హింసనే కాదు... ఆ మాటకొస్తే... నాగరిక సమాజంలో అన్ని రకాల హింసనూ నిక్కచ్చిగా వ్యతిరేకించిన ధీశాలి. గణితశాస్త్రంలో అసమానమేధో సంపత్తిని సొంతం చేసుకున్నా... పది కాలాల పాటు... పచ్చగా సాగిపోయేందుకు వీలైన ఉద్యోగం ఉన్నా... వాటన్నింటినీ కాదనుకుని... తోటి మానవుడి కష్టాలు తీర్చడంలోనే ఆనందాన్ని వెతుక్కున్న నిత్యకృషీవలుడు! మానవ హక్కుల ఉద్యమానికి చిరునామాగా...పర్యాయపదంగా వెలుగొందిన స్ఫూర్తి ప్రదాత!! కందాళ్ల పార్థనాథ శర్మ, నాగమణి దంపతులకు ఐదో సంతానం. 1952 జూన్ 10 బళ్లారిలో జననం. తండ్రి ఉద్యోగం రీత్యా అనేక ప్రాంతాల్లో పనిచేయడంతో వివిధ ప్రాంతాల జీవనశైలిని ఆకళింపు చేసుకున్న బాలగోపాల్ జీవితంలో వరంగల్ ఓ మలుపు. అక్కడే ఆయనకువిప్లవ విద్యార్థి ఉద్యమాలతో పరిచయం. వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కళాశాలలో మ్యాథమెటిక్స్‌లో ఎమ్మెస్సీ, పిహెచ్‌డి పూర్తి చేసిన బాలగోపాల్... ఢిల్లీలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్ట్ డాక్టోరల్ రిసెర్చ్ కోసం చేరారు. 1981లో కాకతీయ యూనివర్సిటీలో మ్యాథ్స్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం రావడంతో ఢిల్లీ నుంచి మళ్లీ వరంగల్‌కు మకాం మారింది. ప్రొఫెసర్‌గా పని చేస్తూనే... ఆయన పౌరహక్కుల ఉద్యమంతో మమేకమయ్యారు. విప్లవ విద్యార్థిసంఘాలతో సన్నిహితంగా మెలిగారు. ఆ సమయంలో వరంగల్ జిల్లాలో నక్సలైట్ ఉద్యమం ఉధృత స్థాయిలో ఉంది. ఉద్యమ సానుభూతిపరులు, ఉద్యమకారులు తీవ్ర అణచివేతకు గురయ్యేవారు. ఈ అన్యాయాలపై ఆయన సమరశంఖం పూరించారు. అనేక బూటకపు ఎన్‌కౌంటర్లను ఆయన వెలుగులోకి తీసుకువచ్చారు. రాజ్యహింసను నిలదీయడం పోలీసులకు గుర్రుగా మారింది. దీంతో ఆయన పైనా నక్సలైట్ అనే ముద్రను పోలీసులు వేశారు. అనేకమార్లు ఆయన పోలీసుల దాడులు ఎదుర్కొన్నారు. ఓసారిఖమ్మం జిల్లా కొత్తగూడెంలో పోలీసులు ఆయనపై దాడి చేసి... చావబాదారు. చనిపోయాడనుకొని ఓ మురికి కాల్వలో పడేసి పోయారు.

జంట బాధ్యతలతో దేనికీ న్యాయం చేయలేననుకున్న బాలగోపాల్... ఉద్యోగాన్ని త్యజించారు. ఉద్యమానికి అంకితమయ్యారు. పౌరహక్కుల ఉద్యమంలో తొలి పూర్తి కాలం కార్యకర్త ఆయనే! 1983లో పౌరహక్కులసంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై... ఆహోదాలో 1998 వరకూ కొనసాగారు. రాజ్య హింసను వ్యతిరేకించిన పౌర హక్కుల ఉద్యమంనక్సల్ హింసను సమర్థించడాన్ని నిరసించారు. ఆ సమయంలో ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం-గమ్యం, గమనం', చీకటికోణం తదితర పుస్తకాలు సంచలనం రేపాయి. ఈ నేపథ్యంలోనే అభిప్రాయభేదాలతో పౌరహక్కుల సంఘాన్ని వదలిపెట్టి... మానవ హక్కుల వేదికను ప్రారంభించారు. ఒక్కడే వందమంది పెట్టున పని చేసి...అన్ని జిల్లాల్లోనూ మానవ హక్కుల ఉద్యమాలు కొన్ని పట్టణాలకు... కొందరు మేధావుల చర్చలకు మధ్యే కుదించుకుపోయిన తరుణంలో...సమస్య ఉన్న మారుమూల ప్రాంతాల ప్రజల మధ్యకు ఉద్యమాన్ని విశాలం చేశారు. దిగువ స్థాయి నుంచి ఉద్యమానికి పునాదులేశారు. హక్కుల వేదికలో నాలుగేళ్లు ప్రధాన కార్యదర్శి హోదాలో పని చేసి... ఇటీవల అక్టోబర్ 2, 3 తేదీల్లో జరిగిన రాష్ట్ర సదస్సులో ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

అనేక ఉద్గ్రంథాలు ఔపోసన పట్టిన మేధావిగా పౌరహక్కుల అణచివేత మొదలుకుని... అనేక సామాజిక సమకాలీన అంశాలపై కలం ఎక్కుపెట్టారు. ఆదివాసుల సమస్య మొదలుకుని... అణుఒప్పందం దాకా... ఏ సమస్యపైనైనా సమగ్ర విశ్లేషణ చేసేవారు. సాధికారతతో మాట్లాడేవారు. ఓ విధంగా చెప్పాలంటే... మూడు దశాబ్దాల ఆయన రచనలు...ఉపన్యాసాలు... సమాజ పరిణామ చరిత్రను కొత్త కోణంలో మనకు పరిచయం చేస్తాయి. ఆంగ్లభాషపై గట్టి పట్టున్న బాలగోపాల్... అనేక సమస్యలపై లోతుపాతులు చర్చిస్తూ ఆంగ్ల భాషలో సైతం అనేక వ్యాసాలు రాశారు. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీకి అనేక రచనలు చేశారు.

విలువల గురించి చెప్పడమే కాక... వాటిని ఆచరణలో పాటించిన మహోన్నతుడు బాలగోపాల్. ఓవిధంగా చెప్పాలంటే... మానవహక్కుల ఉద్యమానికి వెలుపల ఆయనకు వేరే జీవితం లేదు. పేదప్రజలకు న్యాయం అందించడానికి, వారిహక్కులు కాపాడటానికి ఆయన తుదిశ్వాస విడిచేంత వరకూ కృషి సల్పారు. ఈ క్రమంలో అనేక అవాంతరాలు. అడ్డంకులు, బెదిరింపులు, చంపేస్తామంటూ హెచ్చరికలు! తీవ్రనిర్బంధం నడమ

1985లో వరంగల్ వదలి...హైదరాబాద్‌కు వచ్చేశారు. అక్కడ కూడా పౌర హక్కుల ఉద్యమం పూర్తి స్థాయి కార్యకర్తగా పని చేశారు. 1994లో ఎల్ఎల్‌బీ పూర్తి చేసి న్యాయవాద వృత్తిని చేపట్టారు. ఒక్క పైసా తీసుకోకుండా పేదలతరఫున అనేక కేసులు వాదించారు. కేవలం నిజనిర్ధారణలకే పరిమితం కాలేదు. అనేక సాధనాలు ఉపయోగించి... బాధితులకు న్యాయం అందించేందుకు ప్రయత్నించారు. అనేక రూపాలలో ఉద్యమాన్ని కొనసాగించారు. కోర్టులో కేసులు వేయడం మొదలు... అధికారులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వడం... మరోవైపు వాటి సాధనకోసం రోడ్డెక్కి ఆందోళనలు చేయడం ఆయన శైలి. ఆయనతిరగని ఊరు లేదు. ఆయనకు తెలియని పల్లె లేదు. ఎక్కడ అన్యాయం జరిగినా... అక్కడ ప్రత్యక్షమయ్యే వారు. రాష్ట్రంలో రోడ్లు... బస్సు, రైళ్ళ సమయాలుఆయా రవాణా సంస్థల కంటే...బాలగోపాల్‌కే ఎక్కువగాతెలిసేవంటే...ఆయన రాష్ట్రంలోఎంతపర్యటించారో అర్థం అవుతుంది. రాష్ట్రంలోనే కాదు... మానవ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్న కాశ్మీర్, మణిపూర్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లోనూ బాలగోపాల్ సుపరిచితులు. అక్కడి పౌరహక్కుల సంఘం నేతలతో కలిసి ఆయనా రాష్ట్రాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులపై నివేదికలు తయారు చేశారు. వాటన్నింటినీ కలిపి పుస్తకాల రూపంలో నిక్షిప్తం చేశారు. ఇటీవలి కాలంలో ఓపెన్‌కాస్ట్‌లకు వ్యతిరేకంగా, సంఘటిత ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. ప్రజా ఉద్యమాలు ఎదురుదెబ్బలుతిని బలహీనమైన తరుణంలో మానవ హక్కుల ఉద్యమం బాధ్యత పెరిగిందని ఇటీవల అనంతపురంలో జరిగిన మానవ హక్కుల వేదిక మూడవ మహాసభలో బాలగోపాల్ ఉద్ఘాటించారు. సేనానిలా ఆ ఉద్యమాన్ని తీర్చిదిద్దుతున్న తరుణంలో... భారీలోటును ఏర్పర్చి... ఆకస్మికంగా కన్నుమూశారు.